సాక్షి
పల్నాడు

ఆదివారం । 19 । మార్చి । 2023



నేతి వెంకన్నకు పూజలు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్య రూపంలో వెలసిన నేతి వెంకన్నస్వామిని మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు దర్శించుకుని, పూజలు నిర్వహించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 43.4994 టీఎంసీలు ఉండగా ఎగువ నుంచి 13736 క్యూసెక్కులు చేరుతుంది. దిగువకు 200 క్యూసెక్కులు వదులుతున్నారు.

నేడు సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి: లోక సంరక్షణార్థం, సర్వ మానవాళి సంపూర్ణ ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఇంద్రకీలాద్రిపై ఆదివారం సూర్యోపాసన సేవ జరుగుతుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై ఈ సేవ జరుగుతుంది. ఈ సేవలో పాల్గొనే భక్తులు ఆర్జిత సేవా టికెట్ల కౌంటర్‌లో టికెట్లు పొందొచ్చు.



న్యూస్‌రీల్

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలు

నరసరావుపేట ఈస్ట్: విద్యాహక్కు చట్టం ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి గాను పేద వర్గాల విద్యార్థులకు ప్రభుత్వం ప్రైవేటు స్కూళ్లలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 11 వరకు విద్యార్థుల తల్లిదండ్రులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఐబీ, ఐసీఎస్ఈ, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్ అమలు చేస్తున్న స్కూళ్లు ఈ నెల 19లోగా తమ రిజిస్ట్రేషన్లను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు 22వ తేదీ నుంచి రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు అర్హులను ఎంపిక చేసి, ఏప్రిల్ 18న మొదటి రౌండ్ ఎంపిక జాబితాను విడుదల చేస్తారని తెలిపారు. ఆయా స్కూళ్లు ఏప్రిల్ 19 నుంచి 25 వరకు వీరికి ప్రవేశాలు కల్పించాల్సి ఉంటుందన్నారు. ఏప్రిల్ 29న రెండో విడత ఎంపిక జాబితాను విడుదల చేస్తారని, వీరికి మే 1 నుంచి 5 వరకు ప్రవేశాలు కల్పిస్తారని వివరించారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలకు 41,191 మంది హాజరు

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ద్వితీయ సంవత్సర పార్ట్–1 ఇంగ్లిష్ పేపర్–2 పరీక్షలకు ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా 134 కేంద్రాల పరిధిలో 41,191 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలకు దరఖాస్తు చేసిన 42,101 మంది విద్యార్థుల్లో 910 మంది గైర్హాజరయ్యారు. ఎటువంటి మాల్ ప్రాక్టీసు కేసులు నమోదు కాలేదని ఆర్‌ఐఓ జి. సునీత తెలిపారు. మూడు జిల్లాల పరిధిలోని వివిధ పరీక్ష కేంద్రాల్లో అధికారులతో పాటు ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

వివాహ సంబంధిత 72 కేసులు పరిష్కారం



గుంటూరు లీగల్: జాతీయ న్యాయసేవాధికార సంస్థ, ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి ఆధ్వర్యంలో శనివారం జిల్లా వ్యాప్తంగా వివాహ సంబంధిత కేసులకు సంబంధించి ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్‌లో ఉన్న, రాజీ పడదగ్గ కేసులను పరిష్కరించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో 22 భరణం కేసులు, 36 వరకట్న నిషేధ చట్టం కింద నమోదైన కేసులు, 8 గృహ హింస నిషేధ చట్టం కింద నమోదైన కేసులు, 6 ముందస్తు రాజీ భరణం కేసులు మొత్తం 72 కేసులు పరిష్కరించారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహణకు సహకరించిన న్యాయవాదులు, పోలీసులు, ప్రభుత్వ సంస్థలు, న్యాయస్థాన సిబ్బందికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరపున కార్యదర్శి కె.రత్నకుమార్ ధన్యవాదాలు తెలిపారు.

'పది' కేంద్రంలో వసతులు పరిశీలించిన డీఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: పదో తరగతి పబ్లిక్ పరీక్ష కేంద్రంగా ఏర్పాటు చేసిన గుజ్జనగుండ్లలోని రామిశెట్టి రామారావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలను శనివారం డీఈఓ పి.శైలజ పరిశీలించారు. సంబంధిత పాఠశాలలో కొత్తగా టెన్త్ పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో తరగతి గదులు, తాగునీటి వసతి, టాయిలెట్లకు సంబంధించిన సదుపాయాలను పరిశీలించి, ఉపాధ్యాయులతో మాట్లాడారు. 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అంజేసిన ట్యాబ్స్ వినియోగాన్ని ఆమె క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులందరూ పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేయాలన్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం ఎస్.రామకృష్ణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

భవిత పదిలం..
భద్రత పటిష్టం

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ప్రభుత్వం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్న తరుణంలో పరీక్ష కేంద్రాలను పూర్తిస్థాయి భద్రత నిలయాలుగా మార్చుతోంది. భవిష్యత్తుపై ఎన్నో ఆశలతో ఉండే విద్యార్థులు హాల్ టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడమే ధ్యేయంగా గతంలో ఎన్నడూ లేని రీతిలో పటిష్టమైన చర్యలు చేపడుతోంది.

– గుంటూరు ఎడ్యుకేషన్

హై సెక్యూరిటీ జోన్లుగా టెన్త్ పరీక్ష కేంద్రాలు

- పేపర్ లీకేజీ, మాల్ ప్రాక్టీసులకు తావులేని విధంగా పకడ్బందీగా ఏర్పాట్లు
- ప్రశ్న పత్రంపై ఏడు అంకెల ప్రత్యేక కోడ్
- పరీక్ష కేంద్రంలో సీరియల్ నెంబర్ వారీగా విద్యార్థులకు పంపిణీ
- ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణింపు
- పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు నిషేధం
- విద్యార్థులు హాల్‌టికెట్‌తో వచ్చి ప్రశాంతంగా పరీక్ష రాసి వెళ్లేలా ఏర్పాట్లు



గుంటూరులో 'పది' పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినులు

పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేని విధంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం విధించిన మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. అధికారులు టెన్త్ పరీక్ష కేంద్రాలను హై సెక్యూరిటీ జోన్లుగా మార్చివేశారు.

మాల్ ప్రాక్టీసులకు తావులేని విధంగా ..

ఏడాది పొడవునా ఎంతో శ్రమించి, పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే లక్ష్యంతో హాజరయ్యే సమయంలో ఎక్కడో ఒక చోట ప్రశ్నపత్రం లీకేజ్ అయ్యిందంటూ వచ్చే వదంతులతో విద్యార్థులు ఎంతో ఆందోళనకు గురి కావడం జరుగుతోంది. అయితే గతేడాది చోటు చేసుకున్న పేపర్ లీకేజీ సంఘటనల దృష్ట్యా అప్రమత్తమైన ప్రభుత్వం పరీక్ష కేంద్రాల్లోకి కాన్ఫిడెన్షియల్ మెటీరియల్ మినహా, ఇతర ఎటువంటి సామగ్రిని తీసుకెళ్లకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయడంతో పాటు పరీక్షల నిర్వహణలో కఠినంగా వ్యవహరించనుంది.

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకే బాధ్యతలు..

టెన్త్ పరీక్షల విధి నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు రూట్ అధికారులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులుగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులనే నియమిస్తున్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావడంపై నిషేధం విధించిన ప్రభుత్వం డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్లు వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతించలేదు. పరీక్ష విధులకు వచ్చే సమయంలో ఇన్విజిలేటర్లు తమ వెంట సెల్‌ఫోన్లు తీసుకురావద్దని, ఒక వేళ తెచ్చినా వాటిని భద్రపర్చేందుకు పరీక్ష కేంద్రాల్లో ఎటువంటి ఏర్పాట్లు లేవని విద్యాశాఖాధికారులు స్పష్టం చేస్తున్నారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్న దృష్ట్యా, విద్యార్థులను పూర్తిస్థాయిలో సంసిద్ధం చేయడంపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా హాజరుకానున్న 69,412 మంది విద్యార్థులు..

టెన్త్ పబ్లిక్ పరీక్షలకు మూడు జిల్లాల పరిధిలో 368 కేంద్రాల పరిధిలో 69,412 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. గుంటూరు జిల్లాలో 27,714 మందికి 138, పల్నాడులో 24,354 మందికి 127, బాపట్ల జిల్లాలో 17,344 మంది విద్యార్థులకు 103 కేంద్రాల చొప్పున పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్.

- పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇచ్చే ప్రశ్న పత్రంపై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ముద్రిస్తారు. తద్వారా ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నపత్రం లీక్ అయితే, అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని విద్యాశాఖ అమల్లోకి తెచ్చింది. విద్యార్థులకు వారి రోల్ నంబరు ఆధారంగా సీటింగ్ అరేంజ్‌మెంట్లతో పాటు ఓఎంఆర్ షీట్, ప్రశ్న పత్రాలను విద్యార్థులకు సీరియల్ నెంబర్ వారీగా పంపిణీ చేయనున్నారు.
- ప్రతి విద్యార్థికి 24 పేజీలతో కూడిన ఆన్సర్ బుక్‌లెట్‌ను ఇవ్వనున్నారు. అదనంగా పేపర్లు అవసరమైతే 12 పేజీల బుక్‌లెట్‌ను ఇస్తారు. కాగా విద్యార్థులకు ఇచ్చిన ఓఎంఆర్ షీట్, ఆన్సర్ బుక్‌లెట్‌లలో ఏ ఒక్క పేజీని చింపినా మాల్ ప్రాక్టీసుగా పరిగణించే విధంగా కఠినమైన నిబంధనలు అమలు పరచనున్నారు.

పకడ్బందీగా బల్లకట్టుల నిర్వహణ

- రానున్న రోజుల్లో బల్లకట్టు వేలాన్ని సైతం కలెక్టరేట్ నుంచే నిర్వహించేలా చూడాలి
- అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్, జేసీ

నరసరావుపేట: జిల్లాలో కృష్ణానది పరివాహక ప్రాంత మండలాలలోని బల్లకట్టులను ఆయా మండల రెవెన్యూ అధికారి, ఎంపీడీఓ సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో పరిశీలించి వాటి సామర్థ్యాలపై సమగ్రంగా విచారించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరుని వీడియో కాన్ఫరెన్స్ హాలులో అచ్చంపేట, మాచవరం రెవెన్యూ అధికారులు, జిల్లా పరిషత్ సీఈఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎన్ని బలకట్టులు ఉన్నాయి, ఏఏ ప్రాంతాల్లో పనిచేస్తున్నాయి, వాటి సామర్థ్యమెంత, వాటి నిర్వహణ తీరు ఏవిధంగా ఉందనే వివరాలను కలెక్టర్ సేకరించారు. బల్లకట్టు మీద ఎంతమంది ప్రయాణిస్తుంటారు, నిర్వాహకులు సరైన రక్షణ ఏర్పాట్లు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. దీనిపై మండల అధికారులు, రివర్ కన్జర్వేషన్ అధికారులతో పాటు మచిలీపట్నం పోర్ట్ నుంచి అనుభవజ్ఞులను పిలిపించి వారితో కూడా చర్చించి బల్లకట్టు సేవలను ఇంకా పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. రానున్న రోజుల్లో బల్లకట్టు నిర్వహణ వేలాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచే నిర్వహించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యాలయ నిర్వహణ అధికారి మోహనరావు, మండల రెవెన్యూ అధికారులు పద్మావతి, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎస్సీల అభివృద్ధి పథకాలను సమర్థంగా అమలు చేయాలి..

జిల్లాలో షెడ్యూలు కులాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం 2023–24 ఏడాదికి ప్రవేశపెట్టిన పథకాలను జిల్లాలో సమర్థంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధానమంత్రి అనుసుచిత్ జాతి అభ్యుదయ యోజన (పీఎం–అజేయ్) పథకంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఉత్సవధామ్ పథకం కింద కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం కోసం రూ.25లక్షలను కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందన్నారు. అమృత జలధార పథకం అమలుకు 2.5ఎకరాల పొలం ఉన్న లబ్ధిదారుడికి రూ.50వేలు సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని, మిగతా సొమ్మును బ్యాంకు, లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ జోసెఫ్ కుమార్, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖల ఏడీలు, భూగర్భ జలశాఖ డెప్యూటీ డైరక్టర్, లీడ్ బ్యాంకు మేనేజర్, డీసీసీ జనరల్ మేనేజర్ పాల్గొన్నారు.

చెంగీజ్‌ఖాన్ పేట భూముల వ్యవహారం ప్రభుత్వానికి నివేదిస్తాం

యడ్లపాడు మండలం చెంగీజ్‌ఖాన్‌పేట వెన్నముద్దల వేణుగోపాలస్వామి ఆలయానికి సంబంధించి భూముల వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు ప్రయోజనం చేకూర్చుతామని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. 1961 నుంచి వారి పేరుతో అనుభవిస్తున్న సుమారు 400 ఎకరాల ఈనాం భూములను సాగుచేసుకుంటున్న 600 నుంచి 700 మంది రైతులు 2016 నుంచి ఆ భూములను తిరిగి దేవాలయ భూములుగా గుర్తించడంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై శనివారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో దేవదాయ శాఖ అధికారులు, రైతులతో విస్తృతంగా చర్చించారు. ఇరుపక్షాల వాదనలు విన్న అనంతరం ఇరువర్గాలు సరైన నివేదికలు రూపొందించి సమర్పిస్తే, ఆ నివేదికలను దేవదాయశాఖ కమిషనర్, ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపించి రైతులకు లబ్ధి చేకూరేలా చర్యలు చేపట్టడం జరుగుతుందని హామీ ఇచ్చారు. జేసీ ఎ.శ్యామ్‌ప్రసాద్, డీఆర్ఓ వినాయకం, రైతులు పాల్గొన్నారు.

అద్భుతానికి అడుగుదూరంలో..

- కాలీగ్రఫీ డిజైనింగ్‌లో అద్భుతం సృష్టించనున్న కొండవీడు యూపీ స్కూల్ విద్యార్థులు
- హ్యాండ్ రైటింగ్, డబుల్ పెన్సిలింగ్ విభాగంలో ఈనెల 26న ప్రత్యేక ప్రదర్శన
- తమ నైపుణ్యాల ప్రదర్శనకు గిన్నిస్ బుక్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలకు ఆహ్వానం
- తప్పక వస్తామంటూ సమాచారం ఇచ్చిన యూకేకి చెందిన వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్



కాలీగ్రఫీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

యడ్లపాడు: రికార్డ్స్ పుస్తక పుటల్లో చేరి సువర్ణ అధ్యాయాన్ని లిఖించేందుకు ఓ అక్షరయజ్ఞం కొనసాగుతోంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ఈ చరిత్రను సృష్టించేందుకు సిద్ధం అవుతున్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం కొండవీడు గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఇందుకు వేదికగా మారనుంది. ఈ అద్భుత ఘటనకు ఈనెల 26వ తేదీ ఆదివారం సుముహూర్తం కానుంది.

నిజంగా వండర్...

చక్కని చేతిరాతతో మంచి మార్కులు పొందవచ్చు. చేతిరాత అందంగా ఉండటం విద్యార్థులకు ఎంతో అవసరం. అది ప్రాథమిక దశ నుంచి నేర్పిస్తే విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంపొందిస్తుందని భావించాడు కొండవీడు యూపీస్కూల్ హెచ్ఎం జి.శ్రీనివాసరావు. సమీప గ్రామం సొలస ఏపీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేసే కాలీగ్రఫీలో డిప్లొమో చేస్తున్న షేక్ జున్నుసాహెబ్‌ని కలిసి తమ పాఠశాల విద్యార్థులకు చేతిరాతలో నైపుణ్యం నేర్పించాలని అభ్యర్థించాడు. కాలీగ్రఫీ శిక్షణ ఒక్కటే కాదు వారి జీవితంలో శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఏదైనా చేద్దామని సంకల్పించుకున్నారు. వెంటనే విద్యార్థులు, తల్లిదండ్రులకు కాలీగ్రఫీ ప్రత్యేకతలు, వాటి ప్రయోజనాలను వివరించి ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 6 గంటల సమయంలో ప్రత్యేక శిక్షణకు హాజరయ్యేలా చేశారు. ఇందుకు అదే స్కూల్లో విద్యా వలంటీర్‌గా చేస్తున్న చాందినీ సహకారం అందించారు.

160 మంది విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ..

కాలీగ్రఫీ హ్యాండ్‌రైటింగ్, డబుల్ పెన్సిల్ కాలీగ్రఫీ, ఇన్నర్ డిజైన్ ఇన్ కలర్స్ అనే భిన్న విభాగాల్లో ఉత్తమ తర్ఫీదు నిర్వడం ప్రారంభించారు. పాఠశాలలో 188 మంది విద్యార్థుల్లో ఆసక్తి కలిగిన 160 మందికి నెలరోజుల నుంచి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. విభిన్న తరహాలో ఇంగ్లిష్ అక్షరాలను రాయడం, రకరకాల డిజైన్లు రూపొందించడం, ఆ అక్షరాల మధ్య ఇంద్రధనస్సులోని రంగులతో నింపి గీతల్లా, వంపులుగా, గుండ్రంగా, అందంగా ఆకర్షణీయంగా తీర్చిదిద్దేలా నేర్పిస్తున్నారు. ఒకప్పుడు వారికే నచ్చని చేతిరాత ఇప్పుడు అందంగా మారి అందర్నీ ఆకట్టుకుంటూ అబ్బురపరుస్తుంది.

రికార్డు సాధనే అంతిమ లక్ష్యం...

అద్భుత చేతిరాతను పిల్లలకు నేర్పించడమే కాదు.. అంతకు మించిన అద్భుతం సాధించాలని, ప్రపంచ స్థాయిలో రికార్డు చేజిక్కించుకోవాలన్నదే అంతిమ లక్ష్యంగా చేసుకున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఇందులో భాగంగా ఇటీవల గిన్నిస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్, వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లింకా బుక్ ఆఫ్ రికార్డ్స్ సంస్థలకు తాము నేర్పిస్తున్న కాలీగ్రఫీ అండ్ డిజైనింగ్ శిక్షణ వివరాలను దరఖాస్తు చేశారు.

ఈనెల 26న ప్రదర్శన..

అమెరికా, యూకే, భారతదేశంలోని వండర్ క్రియేషన్స్‌ను గుర్తించి, ప్రోత్సహించే పలు సంస్థలకు దరఖాస్తు చేసుకున్న నేపథ్యంలో యూకేకు చెందిన 'వండర్‌బుక్ ఆఫ్ రికార్డ్స్' వీరి దరఖాస్తుకు స్పందించి ఈనెల 26న స్వీయ పరిశీలనకు కొండవీడు వస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు సమాచారం అందించారు. దీంతో ఆ సంస్థ ప్రతినిధుల ముందు తమ సృజనాత్మక నైపుణ్యాలను అత్యుత్తమంగా ప్రదర్శించేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్నారు.

అందరికీ ఆదర్శం కావాలి..



కాలీగ్రఫీ హ్యాండ్‌రైటింగ్ అండ్ డబుల్ పెన్సిల్ డిజైనింగ్ విభాగాల్లో ఏకకాలంలో 160 మంది విద్యార్థులు ఒకేసారి వీటిలో తమ ప్రతిభను చాటి రికార్డు సృష్టించాలని భావించాము. సామూహికంగా, సమన్వయంతో దేన్నైనా సాధించవచ్చనే స్ఫూర్తిని తీసుకువచ్చేందుకే ఈ కార్యక్రమాన్ని పట్టుదలగా చేపట్టాం.

– కాలీగ్రఫీ శిక్షకుడు షేక్ జున్నుసాహెబ్, హెచ్ఎం జి.శ్రీనివాసరావు, షేక్ చాందిని

రికార్డు సాధిస్తాం..



బడికి వెళ్తే పాఠం చెప్పే టీచర్లు చూశాం. కాని మా పాఠశాలలో టీచర్లు ఇంటికొచ్చి అమ్మానాన్నలను ఒప్పించి చదువుతో పాటు చక్కని చేతిరాతను నేర్పిస్తామంటూ బతిమిలాడారు. మా భవిష్యత్తు బాగుండాలని వారు చూపిన శ్రద్ధ మాలో పట్టుదల కలిగించింది. కాలీగ్రఫీలో చేతిరాతే కాదు డిజైన్ వర్క్‌లోనూ మా సొంతంగా వేయడం నేర్చుకున్నాం. గతంలో చెత్తగా ఉన్న మా చేతిరాత ఇప్పుడు బ్రహ్మాండంగా మారింది. తప్పక వండర్‌బుక్ ఆఫ్ రికార్డును సాధించి ఆ విజయాన్ని మాకు నేర్పించిన మాస్టార్లకు కానుకగా ఇస్తాం.

– మేరిగ కీర్తన, లింగమల్లి స్వాతి, కట్టా మానస, శిక్షణ పొందిన విద్యార్థినులు

ఈదురుగాలుల బీభత్సం

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు



నకరికల్లు – మాచర్ల రహదారిలో లారీపై చెట్టు కూలిన దృశ్యం

నకరికల్లు: ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. శనివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. నకరికల్లు పరిధిలోని పలుచోట్ల 70కి పైగా విద్యుత్‌స్తంభాలు నేలకొరిగాయి. స్థానిక ఎస్టీకాలనీలో పదికి పైగా రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. గోడలు కూలిపోయాయి. పలుచోట్ల ఇళ్లపై చెట్లకొమ్మలు విరిగిపడ్డాయి. మొత్తం 30కి పైగా భారీ వృక్షాలు నేలకొరిగాయి. ఈదురుగాలి ధాటికి అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై కంటైనర్ లారీ డివైడర్‌పై పడిపోయింది. నకరికల్లు–మాచర్ల రహదారిలో వైజంక్షన్ వద్ద భారీ వృక్షం పడింది. నర్సింగపాడు సమీపంలో కారుపై మరో వృక్షం పడింది. స్థానిక పీహెచ్‌సీ ప్రధానగేటుకు ఎదురుగా భారీ వృక్షం కూలడంతో బయటకు వచ్చేందుకు సిబ్బంది ఇక్కట్లు పడ్డారు. పొక్లెయిన్ సహాయంతో చెట్టును బయటకు తీసి సిబ్బందిని బయటకు రప్పించారు. మాచర్ల – నకరికల్లు రహదారికి అడ్డంగా భారీవృక్షం కూలడంతో రోడ్డుకు ఇరువైపులా ట్రాఫిక్ స్తంభించింది.

కూలిపోయిన కోళ్లఫారం

నకరికల్లులోని పిడుగురాళ్ల రహదారిలో నకరికల్లుకు చెందిన రావుకొండలు సుమారు రూ.25లక్షలు వెచ్చించి కోళ్లఫారం ఏర్పాటు చేసుకోగా ఈదురుగాలికి పూర్తిగా నేలకూలింది. స్థానిక పాతూరులో మస్తాన్‌వలి కోళ్లఫారం ఏర్పాటు చేసుకోగా పూర్తిగా నేలకూలింది.

ఉన్నత స్థానాలకు ఎదిగి సమాజ సేవ చేయాలి

- కలెక్టర్ శివశంకర్
- 'ఏ డే విత్ కలెక్టర్'లో విద్యార్థులకు సూచన


కలెక్టరేట్‌లో విద్యార్థులతో జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: విద్యకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను వినియోగించుకొని గొప్ప లక్ష్యాలతో ఉన్నత స్థానాలకు చేరి సమాజ సేవ చేయాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ విద్యార్థులకు పిలుపు నిచ్చారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లో నిర్వహించిన 'ఏ డే విత్ కలెక్టర్' కార్యక్రమంలో తొమ్మిది, పదో తరగతి విద్యార్థులతో సమావేశమయ్యారు. విద్యార్థులను పరిచయం చేసుకొని వారు ఎంచుకున్న లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకున్న పరిజ్ఞానంలో వేసిన ప్రశ్నలకు వారికి అర్థమయ్యే రీతిలో జవాబులు ఇచ్చారు. ఐఏఎస్‌గా ఎదిగేందుకు తాను పడిన కష్టాన్ని, ఉన్నత చదువులు చదవడానికి గల కారణాలను వివరించారు. విద్యార్థులు పెట్టుకున్న లక్ష్యాలకు చేరుకోవాలంటే అందుకు తగిన విధంగా అన్ని విషయాలపై పట్టు సాధించాలని సూచించారు. ఉన్నత చదువులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్(పి.పి.టి) ద్వారా వివరించారు. విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి చక్కని జవాబులు చెప్పిన వారికి బహుమతులు అందజేశారు. ప్రతి రోజు న్యూస్ పేపర్లు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. అందులో విజయం సాధించిన వారి కథలు, ఇంటర్వ్యూలు చదివి తెలుసుకోవాలన్నారు. ప్రస్తుతం మీరు చదువుతున్న పాఠశాల, పుట్టిన ఊరికి గొప్ప పేరు కీర్తి, ప్రతిష్ఠలు తీసుకురావాలని సూచించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ గురుకుల, ఉన్నత పాఠశాలు, వసతి గృహాలు, గిరిజన సంక్షేమ శాఖ ప్రభుత్వ పాఠశాలల నుంచి మొత్తం 70మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్సీహెచ్ పోర్టల్ సక్రమంగా నిర్వహించాలి

డీఎంహెచ్ఓ జి.శోభారాణి

క్రోసూరు: ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు తప్పనిసరిగా ఆర్సీహెచ్ పోర్టల్ సక్రమంగా నిర్వహించాలని డీఎంహెచ్ఓ జి.శోభారాణి కోరారు. క్రోసూరు పీహెచ్‌సీ, పారుపల్లి గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాలను శనివారం పరిశీలించారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లుకు ప్రభుత్వం ఇచ్చిన యాప్‌ను పరిశీలించారు. ప్రతి ఒక్క ఏఎన్ఎం, ఆశ వర్కర్లు ఆర్సీహెచ్(రీప్రొడక్టివ్ అండ్ చైల్డ్ హెల్త్ పోర్టల్)ను బాగా తెలుసుకుని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఏప్రిల్‌లో రాష్ట్రమంతా ప్రారంభించనున్న దృష్ట్యా ప్రజల మన్నన పొందే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ ప్రవీణదీప్తి, పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ బాలఅంకమ్మబాయి పాల్గొన్నారు.


పీహెచ్‌సీలో ఏఎన్ఎంతో మాట్లాడుతున్న పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ శోభారాణి

పల్నాడు జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా అక్బర్

కారెంపూడి: వక్ఫ్ బోర్డు పల్నాడు జిల్లా చైర్మన్‌గా కారెంపూడికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు షేక్ అక్బర్ జానీబాషాను ప్రభుత్వం నియమించింది. ఈ సందర్భంగా పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి శనివారం అభినందించారు. ప్రభుత్వ ఆదేశాలు ఆశయాల మేరకు పల్నాడు జిల్లాలోని ముస్లిమ్ మైనార్టీ వర్గాల అభ్యున్నతికి మంచి సేవలందించాలని వెంకటరామిరెడ్డి ఆకాంక్షించారు. తనకు చైర్మన్ పదవి ఇవ్వాలని ప్రభుత్వానికి సిఫార్స్ చేసిన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి అక్బర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎం.శ్రీనివాసశర్మ, టౌన్ వీరారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు షేక్ షఫీ, బొమ్మిన అల్లయ్య, షేక్ ఆరీఫ్, కొమ్ము చంద్రశేఖర్, బత్తుల బైరాగివర్మ, మగ్బుల్ జానీబాషా, అన్నపరెడ్డి రాము పాల్గొన్నారు.


అక్బర్‌కు నియామక పత్రం అందిస్తున్న వెంకటరామిరెడ్డి

నూలుమిల్లులో మహిళ అనుమానాస్పద మృతి

యడ్లపాడు: వలస కార్మికురాలు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాలు.. యడ్లపాడు మండలం తిమ్మాపురంలోని కృష్ణగంగా నూలుమిల్లులో ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా కోజాపల్లి తాలూకాకు చెందిన చాందిని భిషోయ్, కుమార్‌భిషోయ్ దంపతులు ఉపాధి నిమిత్తం వలస వచ్చి కార్మికులుగా చేరారు. మిల్లులోని క్వార్టర్స్‌లో ఉంటూ ఇద్దరు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వీరికి రెండేళ్ల కిందట వివాహమైనా సంతానం కలుగలేదు. భర్త జీతం డబ్బులతో మద్యం తాగుతూ క్వార్టర్స్‌లోని తమ బంధువుల రూంలో ఉండగా రోజు మాదిరిగానే శుక్రవారం సాయంత్రం చాందిని డ్యూటీకి వెళ్లింది. వెళ్లిన కొద్ది సేపటి తర్వాత డ్యూటీ వద్ద కడుపులో నొప్పిగా ఉందంటూ చెప్పి చాందిని క్వార్టర్‌కు వచ్చింది. మరుసటి రోజు రూంలో తలుపులు మూసి ఉండని గమనిస్తే చాందిని(20) రేకుల కప్పుకు ఉన్న పైపుకు చీరతో ఉరివేసుకుని ఉంది. దీంతో కంపెనీ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నరసరావుపేట డీఎస్పీ విజయభాస్కరరావు, రూరల్ సీఐ అచ్చయ్య, యడ్లపాడు ఎస్ఐ పైడి రాంబాబు శనివారం ఘటనా స్థలానికి వెళ్లి అనుమానాస్పద కేసుగా నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు.


మిల్లులో కార్మికుల నుంచి ఘటన వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ విజయభాస్కర్, సీఐ అచ్చయ్య

అకాల వర్షంతో అవస్థలు


పిడుగుపాటుకు కుప్పకూలిన రేకుల షెడ్డు


నకరికల్లులో ఈదురుగాలి ధాటికి కూలిన కోళ్లఫారం షెడ్డు

పిడుగురాళ్ల/నకరికల్లు: జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం శనివారం పండింది. పట్టణంలో పిడుగుపాటుకు రేకుల షెడ్డు దెబ్బతింది. దీంతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురయ్యారు. ఈ క్రమంలోనే పట్టణంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న వీధిలోని ఖాళీ స్థలంలో పిడుగు పడటంతో పిడుగు దాటికి పక్కనే ఉన్న రేకుల షెడ్డు నెలమట్టమైంది. చుట్టుపక్కల ఉన్న గృహాల్లో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు వంటివి ఎలక్ట్రికల్ వస్తువులు కాలిపొయ్యాయి. చుట్టుపక్కల ఉన్న గృహాల గోడలు బీటలు వారాయి. ఓ ఇంటి వాటర్ ట్యాంక్ బీటలు వారటంతో ట్యాంక్‌లో ఉన్న నీరంతా కారిపోయింది.

నకరికల్లులో..

వర్షం బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు నేలకొరిగాయి. జనజీవనం స్తంభించింది.


అద్దంకి-నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై ఈదురుగాలి ఉధృతికి పడిన కంటైనర్ లారీ

పోలీసుల అదుపులో గంజాయి ముఠా

మార్టూరు: అక్రమంగా భారీ మొత్తంలో విజయవాడ వైపు నుంచి ఒంగోలు వైపు గంజాయి తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను మార్టూరు పోలీసులు వెంబడించి అదుపులోనికి తీసుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ఓ ముఠా వాహనంలో మార్టూరు వైపు వస్తున్న సమాచారం అందుకున్న ఎస్ఐ కమలాకర్ జాతీయ రహదారిపై నిఘా వేశారు. ఈ క్రమంలో బల్లికురవ నుంచి మార్టూరు వైపు వచ్చే రోడ్డులో గంజాయి తరలించే వాహనం వస్తుందని తెలుసుకున్న ఎస్ఐ కమలాకర్ ఓ ప్రవేట్ వాహనంలో అదే మార్గంలో వాహనానికి ఎదురు వెళ్లారు. మార్టూరు శివారులో అనుమానిత వాహనాన్ని గుర్తించిన ఎస్ఐ వెంటనే స్టేషన్‌కు ఫోన్ చేసి ఏఎస్ఐ సైదాను ఇతర సిబ్బందిని అప్రమత్తం చేసి ముందు కారులోనివారికి అనుమానం రాకుండా తన కారు రివర్స్ చేసుకొని ఆ వాహనాన్ని వెంబడించారు.స్థానిక పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ సమీపంలోని కూడలిలో అదే మార్గంలో అప్పటికే కాపుకాసి ఉన్న ఏఎస్ఐ సైదా కారుకు అడ్డుగా నిలబడి వాహనాన్ని ఆపారు. అప్పటికే అక్కడికి చేరుకున్న ఎస్ఐ కమలాకర్ నిందితులను చాకచక్యంగా అదుపులోనికి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. నిందితులు ఎక్కడ నుంచి వస్తున్నారు. గంజాయి ఉన్న వాహనం ఎక్కడికి వెళుతున్నది అన్న వివరాలను ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా సినీ ఫక్కీలో ప్రత్యక్షంగా జరిగిన ఈ సంఘటనలో పోలీసులు చూపిన ధైర్యసాహసాలను ప్రత్యక్ష సాక్షులు అభినందనలు తెలపడం గమనార్హం.